క్లుప్తంగా

బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం



సాయికుమార్‌ను అభినందిస్తున్న కోచ్ రామారావు

దత్తిరాజేరు: మొరక ముడిదాం మండలం బుధరాయివలస గ్రామానికి చెందిన సారికి ఆదినారాయణ,సావిత్రిల కుమారుడు సాయి కుమార్ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాయికుమార్ చిన్నప్పటి నుంచి దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లిలో తాత కలిశెట్టి చిన్నం నాయుడు ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాడు. డిగ్రీ పూర్తి చేసి విజయనగరంలో ఆర్మీ విశ్రాంత ఉద్యోగి దాసరి రామారావు వద్ద రన్నింగ్, బాడీ ఫిట్‌నెస్, వ్యాయామంలో శిక్షణ పొందుతూ పలు ఉద్యోగ ప్రయత్నాలు చేశారు. ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పరీక్షకు హాజరు కాగా, తాజాగా ప్రకటించిన ఫలితాల్లో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించాడు.

భవిత కేంద్రం సందర్శన



ప్రత్యేక అవసరాల విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: స్థానిక భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్.అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు సోమవారం సందర్శించారు. కేంద్రంలోని ప్రత్యేక అవసరాల విద్యార్థుల విద్యా నైపుణ్యాలను అంచనా వేశారు. ఫిజియోథెరపీ సేవ లను పరిశీలించారు. సిబ్బంది సేవాతత్వంతో విధులు నిర్వర్తించాలని కోరారు. అధికారుల వెంట ఐఈఆర్‌పీ లీలాకృష్ణ, ఫిజియోథెరపిస్ట్ వై.శ్రావణి ఉన్నారు.

వాసవీ క్లబ్ డిస్ట్రిక్ ఇన్‌చార్జ్‌కి అవార్డు



అవార్డు అందుకుంటున్న నారాయణరావు

గంట్యాడ: వాసవీ క్లబ్ డిస్ట్రిక్ ఇన్‌చార్జ్‌గా సేవ లందిస్తున్న మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన గోనుగుంట్ల నారాయణరావుకు వాసవి క్లబ్ బెస్ట్ డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ అవార్డుకు ఎంపికయ్యారు. తమిళనాడులోని మధురైలో ఆదివారం నిర్వహించిన వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఐకాన్ సమావేశంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.ఎస్.రవిచంద్ర చేతుల మీదుగా నారాయణరావు అవార్డు అందుకున్నారు. వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకంలో భాగంగా భీమవరం గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రాజయ్యబాబు చెరువు వరకు చేపడుతున్న ఫీడర్ చానెల్ పనులను ఆపథకం ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేశారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు.

ఇంధన పొదుపు చర్యలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు, బుర్రకథ బృందం

చీపురుపల్లి: భవిష్యత్ తరాల కోసం ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ఏపీఈపీడీసీఎల్ ఏఈ ప్రభాకర్ సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మూడురోడ్ల జంక్షన్ వద్ద సోమవారం బుర్రకథ ద్వారా ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఇంటింటా కరెంటు పొదుపు ఊరూరా వెలుగు, విద్యుత్ పొదుపు అందరి బాధ్యత, సోలార్ విద్యుత్ కాలుష్యరహితం, జనహితం అంటూ ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి: మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పేరిపి గ్రామంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు ఆసంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు సోమవారంఒ ప్రకటనలో తెలిపారు. రామమందిరం వద్ద ఉదయం 8.30 గంటలకు శిబిరం ప్రారంభమవు తుందని, విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు హాజరై వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు.

సారూ.. ఏం తేల్చారు.?

ఆర్ఈసీఎస్ సంగతి

- కూటమి అధికారంలోకి రాగానే ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీ
- బహిరంగ సభలో మాట ఇచ్చిన చంద్రబాబు
- ఆరు నెలలు గడుస్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించినా పట్టించుకోని ప్రభుత్వం



ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం (ఫైల్)

చీపురుపల్లి: సారూ... చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్ఈసీఎస్) సంగతి ఏం తేల్చారు.. ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరి స్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు కదా, ఎవరో చెబితే సరే సాక్షాత్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే బహిరంగ సభలో హామీ ఇచ్చారు..ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా ఎందుకు ఆర్ఈసీఎస్ సేవలు అందు బాటులోకి రాలేదు..? ఇదీ ప్రస్తుతం చీపురు పల్లి నియోజకవ ర్గంలో జరుగుతున్న చర్చ. అయితే కూటమి ప్రభుత్వం పెద్దలు ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌తో పాటు ఏ జిల్లాకు వెళ్లినా ఆ జిల్లాలో సమ స్యలను పరిష్కరించేస్తాం, ప్రధాన అంశాలపై అధికారంలోకి రాగానే దృష్టిపెడతాం, అమలు చేసేస్తామంటూ హామీ ఇచ్చి ప్రజలను నమ్మించారు. చీపురుపల్లి ప్రజలకు కూడా అనేక హామీలతో పాటు ఆర్ఈసీఎస్ గురించి కూడా హామీ ఇచ్చారు.

ప్రభుత్వం నుంచి స్పందన కరువు

ఏపీఈపీడీసీఎల్‌లో విలీనమై కార్యకలాపాలు సాగిస్తున్న ఆర్ఈసీఎస్‌ను కూటమి ప్రభుత్వం రాగానే పునరుద్ధరిస్తామని, ఈ విషయం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కళా వెంకటరావు హామీ ఇచ్చారు. కూటమి నాయకులు కూడా దీన్నే ఎన్నికల ప్రధాన ప్రచార అంశంగా వాడుకున్నారు. తాము అధికారంలోకి రాగానే ఆర్ఈసీఎస్ సేవలను అందుబా టులోకి తీసుకొస్తామని, ప్రతీ గ్రామంలో సమావేశాలు నిర్వహించి చెప్పుకొచ్చారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఊదరగొట్టారు. 2024 మే 9న చీపురుపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార బహిరంగ సభకు టీడీపీ అధి నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఆ సభలో ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరించాలని ఇక్కడి ఎమ్మెల్యే అభ్యర్థి కళావెంకటరావు చంద్రబాబును కోరడమే కాకుండా ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు చంద్రబాబు వేలాది మంది సాక్షిగా తాము అధికారంలోకి రాగానే ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరించేస్తామని హామీ ఇచ్చారు.సాక్షాత్తూ చంద్రబాబు చెప్పి నప్పటికీ ఆ హామీ ఆచరణకు నోచుకోలేదు. కొద్దిరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు.ఎన్నికల సమయంలో మనం హామీ ఇచ్చామని గుర్తు చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో సూపర్ సిక్స్ హామీల మాదిరిగానే ఈ హామీ కూడా అటకెక్కినట్లేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిషేధిత భూముల జాబితాలోకి ఎలా వెళ్లాయి..?



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న జిరాయితీ భూములు నిషేధిత(22ఏ) భూములుగా మారిపోయాయని, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పౌరసరఫరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. పేరిపి గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. పేరిపి రెవెన్యూ పరిధిలో తనతో పాటు రైతులకు చెందిన దాదాపు 350 ఎకరాల జిరాయితీ భూములను నిషేధిత భూములుగా రికార్డులు చూపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు చేసిన నిర్వాకం కారణంగా జిరాయితీ భూములు నిషేధిత భూములుగా మారిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్ ఎస్.రాజారావుకు వినతిపత్రం అందజేశారు. నోడల్ ఆఫీసర్ హేమసుందరరావు, సబ్ రిజిస్ట్రార్ లక్ష్మణరావు, ఆర్ఐ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దేవస్థానంలో వేలం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కొబ్బరి చెక్కలు, చీరలు, జాకెట్టు ముక్కలు దక్కించుకునేందుకు కొట్టాం గ్రూపు దేవాలయాల ఈఓ జి.శ్రీనివాస్ సమక్షంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. 2025 మార్చి 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు భక్తుల నుంచి వచ్చే కొబ్బరి చెక్కలు వేలంను తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బుంగ బాబూరావు రూ.1,27,500కు దక్కించుకున్నారు. చీరలు, జాకెట్టు ముక్కల వేలంను గింజల స్వామి రూ.1,08,000కు దక్కించుకున్నట్లు స్థానిక దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



విజేతలకు పతకాలు అందజేస్తున్న డీఎస్పీ రాఘవులు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘు వులు అన్నారు. గరివిడి శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో సోమవారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 100 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, జావెలిన్‌త్రో, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. చీపురుపల్లి సీఐ ఎస్.శంకరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాయినాథ్ రెడ్డి

గజపతినగరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ కార్యనిర్వాహక సభ్యుడు చుక్కా సాయినాథ్ రెడ్డి అన్నారు. స్థానిక సాయిసిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు దరిచేరవని, అధిక రక్తపోటు సమస్య ఉండదని, ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ క్లబ్ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, సంస్థ డైరెక్టర్ శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తవలస: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ఐసీడీఎస్ పీఓ కార్యాల యం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీల గౌరవేతనం తక్షణమే పెంచాలని, మినీ కేంద్రాలను ప్రధాన సెంటర్లగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే ఆన్‌లైన్ యాప్‌లను, రికార్డులను కుదించాలని, మేనెల అంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, 5ఏళ్ల లోపు పిల్లలు కచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రాలకే వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సహాయ పీఓ రమాబాయికి వినతిపత్రం అందజేశారు.అంగన్‌వాడీల సంఘం నాయకులు కె.కె.లక్ష్మి, కె.రమణమ్మ, ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్నపురోహితులు శ్రీహరిశర్మ

లక్కవరపుకోట: స్థానిక రామాలయంలో పురోహితులు ఏ.శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. నెలరోజుల పాటు రో జూ మేలుకొలుపు, పూజలు చేస్తామని, భోగి రోజున గోదాదేవి కల్యాణంతో ఉత్సవాలు ముగిస్తాయని పురోహితులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీయల్ చూపిస్తున్న విద్యార్థులు

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు సంకల్ప్-2025లో భాగంగా ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు సోమవారం స్టడీమెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు అదనపు తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ఏ,బి,సి కేటగిరిలుగా విభజించి, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామన్నారు. గతేడాది ఫలితాల్లో తమ కళాశాల జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని,ఈ ఏడాది మొదటిస్థానం సాధించాలన్న లక్ష్యంతో అధ్యాపకులంతా కృషి చేస్తున్నారని చెప్పారు.

సుపథ పరీక్షల్లో ప్రతిభ



సాధించిన బహుమతులు, సర్టిఫికెట్లతో సర్వేపల్లి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు



సుపథ పోటీల్లో సత్తా చూపిన కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక సర్వేపల్లి విద్యానికేతన్, కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సుపథ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాలల ప్రిన్సిపాళ్లు సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సుపథ సంస్థ సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు శ్లోక పఠనం, పద్య పఠనం, వేదం, గేయాలు, వ్యాసరచన, క్విజ్ అంశాల్లో ఆదివారం పోటీలు నిర్వహించారు. 423 మంది విద్యార్థులు హాజరైన ఈ పరీక్షలో తమ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటి, బహుమతులు సాధించారని సర్వేపల్లి విద్యానికేతన్, కౌముది గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు చెప్పారు.

నిరంతర ఆదాయం

మెరకముడిదాం: ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటల సాగుతో నిరంతర ఆదాయం పొందవ చ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సూర్యకుమారి అన్నారు. గాతాడ గ్రామంలో ప్రకృతి సేద్యం ద్వా రా కూరగాయలు, ఆకుకూరల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు బొత్స అప్పారావు, ఎల్. అప్ప లనరసమ్మకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో క్యారెట్, బీట్‌రూట్, బెండ, మిరప, టమాటా, చిక్కుడు, కాకర, ఆనప, తోటకూర, గొంగూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, బొప్పాయి విత్తనాలను నాటారు. ప్రకృతివ్యవసాయ సిబ్బంది కల్యాణి, రమాదేవి, ఈశ్వరరావు, రాము పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

గజపతినగరం: స్థానిక డీఎన్ఏ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మండల పాస్టర్ల ఫ్యామిలీ(ఐక్య) ఆధ్వర్యంలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు,గీతాలపన చేశారు. సీనియర్ ఉపన్యాసకులు ఎస్.జయకుమార్ ఏసు సందేశాన్ని వినిపించారు. పిల్లలు, పెద్దలకు ఆటలు,పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహు మ తులు అందజేశారు.పాస్టర్లు ఏ.చంద్రశేఖర్, కృపారావు తదితరులు పాల్గొన్నారు.



ఏసు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ జయకుమార్

బీసీజీ వ్యాక్సినేషన్



ఒకరి నుంచి ఒకరికి సోకే అత్యంత ప్రమాదకర వ్యాధి క్షయను అవగాహనతోనే అంతం చేయగలమని గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. చీపురుపల్లి టీబీ యూనిట్ సూపర్ వైజర్ లలిత ఆధ్వర్యంలో గరివిడి మండలంలోని డీఎఫ్ఎన్ ప్రాంతంలో ఉన్న రాధిక వెజిటబుల్ ఆయిల్ కంపెనీలో కార్మికులకు సోమవారం అవగాహ న కల్పించడంతో పాటు 19మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేశారు. వైద్యాధికారి క్షయ లక్షణాలను వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వ్యాధిగ్రస్తులు అశ్ర ద్ధ చేయకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్‌లో టీబీ టెస్ట్, ఎక్స్‌రేలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. – చీపురుపల్లిరూరల్(గరివిడి)

అపూర్వ కలయిక



వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–1990 మధ్య 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తాటిపూడి సన్ రిసార్ట్స్‌లో సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసు కోవడంతో ఒకరినొకరు ఆప్యా యంగా పలకరించుకుని, యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి రోజంతా సందడిగా గడిపారు – వేపాడ

ఘనంగా విజయ్ దివస్



గరివిడి మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాలలో స్థానిక సాదిక్ ఫ్రీ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించా రు.1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ బలగాలు సాధించిన విజ యానికి గుర్తుగా ఏటా డిసెంబర్16న విజయ్ దివస్ జరుపుకుంటున్నామని ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి గంగ్రేటి సత్యనారాయణ(నాయక్) తెలిపారు. నాటి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత్ జవాన్లకు నివాళి అర్పించారు. ఉప సర్పంచ్ గేదెల శంకరరావు, సాదిక్ ఫ్రీ ట్యూషన్ సెంటర్ ట్యూటర్లు మీసాల సాయికుమార్, మీసాల అంజి పాల్గొన్నారు. – చీపురుపల్లిరూరల్(గరివిడి)

సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ సురేష్



వేపాడ: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ట్రైనీలు

చీపురుపల్లి: గ్రామాల సుస్థిర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఈఓపీఆర్‌డీ ఐ.సురేష్ సూ చించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణతరగతులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ప్రజారోగ్యం, పంచాయతీ నిధుల వినియోగం, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పేదరికం నిర్మూలన తదితర అంశాలపై సామర్లకోట శిక్షణా కేంద్రం ట్రైనీ డి.ఆర్.ఎన్.పద్మజ, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ దేముడు తదితరులు శిక్షణ ఇచ్చారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం

వేపాడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, సచివాల య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులను రెండు బ్యాచ్‌లుగా విడదీసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల పరిషత్, వెలుగు కార్యాలయాల్లో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు, ఏఈఓ సూరిబాబు, ఈఓపీఆర్‌డీ రవికుమార్, జెడ్పీటీసీ అప్పారావు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం



ముద్దూరు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: క్షయపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టీబీ నోడల్ అధికారి ఎస్.ఏ.బాషా అన్నా రు. క్షయ వ్యాధి నిర్మూలనకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని ముద్దూరులో సోమవా రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా టీబీ నోడల్ అధికారి ఎస్.ఏ.బాషా మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను నమలడంతో పాటు పీల్చడం ద్వారా టీబీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూ చించారు.టీబీ యూనిట్ సూపర్ వైజర్ జి.రాము, సర్పంచ్ మునకాల పైడి పునాయుడు, మాజీ సర్పంచ్ కె.నారాయణరావు, వైద్య సిబ్బంది రాధ, సంధ్య పాల్గొన్నారు.